ప్రజాశక్తి
ఆదివారం 23 ఏప్రిల్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

భారంగా గృహ నిర్మాణం

- పెరిగిన నిర్మాణ వ్యయం
- పెరగని ప్రభుత్వ సాయం
- లక్ష్యం పూర్తికి అధికారుల ఆపసోపాలు
- బిల్లులు రాక కాంట్రాక్టర్ల వెనుకంజ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణం అటు అధికారులకు, ఇటు లబ్ధిదారులకు భారంగా మారింది. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులపై వత్తిడి పెంచుతోంది. లబ్ధిదారులు మాత్రం తమ వద్ద ఆర్థిక స్థోమత లేదని మీరు కట్టి ఇవ్వండి అని సొంతంగా నిర్మాణానికి వెనుకంజ వేస్తున్నారు. నిర్మాణ వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరగడంతో రూ.లక్షా 80 వేలతో ఇల్లు పూర్తి చేయడం అసాధ్యమని లబ్ధిదారులు వాపోతున్నారు. జగనన్న కాలనీల్లో పేదలందరికీ ఇళ్ళ పథకం ద్వారా ఉగాది నాటికి

జిల్లాలో 13,341 ఇళ్లు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 8,150 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఉగాదికి నిర్ధేశించిన లక్షం మేరకు వచ్చే నెల చివరి నాటికి 13, 341 ఇళ్లను పూర్తి చేయడానికి అధికారులు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. లే అవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలకు నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా ప్రత్యేక అధికారులు, హౌసింగ్, ఇతర శాఖల మండలస్థాయి అధికారులను జిల్లా అధికారులు వత్తిడి తెస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అనేక సమస్యల వల్ల ఈ లక్ష్యంలో పురోగతి తక్కువగానేఉంది. లేఅవుట్‌లో లబ్ధిదారుల వారీగా సచివాలయ సిబ్బందితో మ్యాపింగ్ చేసి వత్తిడి పెంచినా ఇళ్ళ నిర్మాణాల పురోగతి తక్కువుగానే ఉంది. రోజుకు 128 ఇళ్లకు గాను 28 నిర్మాణం జరుగుతుందని ఇటీవల గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తన సమీక్షలో అసంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణంపై ప్రత్యేక అధికారులు మరింతగా శ్రద్ధ తీసుకున్నా పూర్తి చేయలేకపోతున్నారు. గ్రామీణప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చేది రూ.లక్షా 59 వేలు కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేలు ఇస్తుంది. ఉపాధి హామీ పథకంలో 90 రోజుల పని దినాల ద్వారా ఒక్కొక్క పనిదినానికి రూ.257 చొప్పున రూ.23,130 సమకూరుతుంది. మరో రూ.12 వేలు స్వచ్ఛ భారత్ పథకంలో మరుగుదొడ్డినిర్మాణానికి కేటాయిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చే రూ.30 వేలు ఈ రూపంలో వస్తాయి. ఇవి కాక మరో రూ.35 వేలు బ్యాంకు నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణం ఇప్పిస్తున్నారు. మొత్తం రూ.2.15 లక్షలతో ఇళ్లుపూర్తి కాని పరిస్థితి నెలకొంది. ప్రతి లబ్ధిదారుడు సొంతంగా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అదనంగా వెచ్చిస్తే తప్ప ఇళ్లు పూర్తి కాని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా నిర్మాణ ఖర్చుల్లో భాగంగా కూలీలకు ఎక్కువగా వెచ్చించాల్సివస్తుంది. దీంతో ఆర్థికంగా స్థోమత లేని వారు ఇళ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసుకోలేకపోతున్నారు. గత ఏడాది కాలంగా జిల్లాలో ఈ మందగమనం కొనసాగుతోంది. గతేడాది కాలంలో జిల్లాలో 67 వేల ఇళ్లను ప్రారంభించగా కేవలం 8150 ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారు.

మొత్తంగా 12శాతం పురోగతి సాధించారు. ఇళ్ల నిర్మాణం పూర్తికావాలంటే బ్యాంకుల నుంచి సున్నా వడ్డీతో కనీసం 2 నుంచి రూ.3 లక్షలు రుణం ఇప్పించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రభుత్వానికి సూచించారు. మరో వైపు మౌలిక సదుపాయాలకల్పన, ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నకాంట్రాక్టర్లుకు ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో రాకపోవడం కూడా కొంత మందికి ఇబ్బందిగా మారింది. అలాగే కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి కూడా ఆశించిన పురోగతి లేదు. మౌలిక సదుపాయలు కల్పించేందుకు వివిధ శాఖల ఆద్వర్యంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు జాప్యం అవుతున్నాయని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. దీని వల్ల ఒక లే అవుట్‌నుంచి మరో లే అవుట్‌కు సదుపాయాల కల్పన భారంగా మారింది.

ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద, బిజెపిని సాగనంపుదాం - దేశాన్ని కాపాడుకుందాం

రేపు మంగళగిరిలో సిపిఎం, సిపిఐ బహిరంగ సభ

హాజరు కానున్న జాతీయ, రాష్ట్ర నేతలు బివి రాఘవులు, కె రామకృష్ణ

జయప్రదం చేయాలని పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్ పిలుపు

ప్రజాశక్తి - గుంటూరు

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర వ్యాపిత ప్రచారంలో భాగంగా ఈ నెల 24న సాయంత్రం 5గంటలకు మంగళగిరి ఆటోనగర్ వద్ద జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపియం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ సభలో సిపియం జాతీయ నాయకులు బి.వి.రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కేంద్రంలో బి.జె.పి అధికారంలోకి వచ్చాక నిత్యజీవితావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగిపోయాయని, ప్రజలకు ఆదాయాలు మాత్రం పెరగలేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా వున్న ప్రభుత్వ రంగ సంస్థలను, కారుచౌకగా పెట్టుబడిదారులకు, కార్పోరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉధ్యమించాలని పిలుపు నిచ్చారు. యల్.ఐ.సి, జి.ఐ.సి, రైల్వేలు, టెలికం వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రకతి వనరులను ప్రైవేటీకరించడం దారుణమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు, వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. భారత రాజ్యాంగలోని సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని, కేంద్ర ప్రభుత్వ సంస్థలను వినియోగించుకుని, ప్రతిపక్షాలను, ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ నేపథ్యంలో జరిగే బహిరంగ సభలో సిపిఎం, సిపిఐ శ్రేణులు విస్తతంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

రాజధానిలో ముదురుతున్న మరో వివాదం

7 వీక్షణం

8లో

ఆగష్టు 13,14,15తేదీలలో గుంటూరులో ఐలు రాష్ట్ర మహాసభలు

సమావేశంలో మాట్లాడుతున్న నర్రా శ్రీనివాసరావు

వార్త మెయిన్‌లో

కురగల్లులో ఉద్రిక్తత

ఆర్ 5 జంగిల్ క్లియర్ పనులను అడ్డుకునే యత్నం

ముగ్గురు రైతులు అరెస్ట్ -విడుదల

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కష్ణ గుంటూరు జిల్లాలలోని పేదలకు రాజధాని గ్రామాల్లో సెంటు భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆమేరకు సిఆర్‌డిఎ నుండి భూమి బదలాయింపు ప్రక్రియను చేపట్టింది. ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అర్5 జోన్‌లో జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు శనివారం సిఆర్‌డిఎ అధికారులు రంగంలోకి దిగారు. కంపను తొలగించే ప్రయత్నం చేపట్టగా రైతులు, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడి రైతులు తోట రామారావు, జి గోపాల కృష్ణ, మీసాల శ్రీనివాసరావులను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి అనంతరం వదిలివేశారు. విషయం తెలుసుకున్న రాజధాని రైతులు మంగళగిరి పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతు అమరావతి రాజధానిలో మరో సంగ్రామానికి రంగం సిద్ధమైందని పేర్కొన్నారు. అమరావతిపై పాలకుల కక్ష సాధింపు చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. రాజధాని అమరావతి వివాదం కోర్టు పరిధిలో ఉండగా, పేదలకు ఇళ్ల కేటాయింపుకు జీవో 45 ఇవ్వటం ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే అన్నారు. భవిష్యత్ అవసరాలు నిమిత్తం మాస్టర్ ప్లాన్‌లో ఉంచిన భూములను నవులూరులో 60 ఎకరాలు, ఎర్రబాలెం 150 ఎకరాలు, కురగల్లు 60 ఎకరాలు అదనంగా నవరత్నాలు పేదలకు ఇళ్లకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం పూనుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో భూములను స్దానికేతరులకు ఇళ్ల స్దలాలు కేటాయింపుపై రాజధాని రైతుల అభ్యంతరం చేశారు. రాజధానికి భూములిస్తే మా ప్లాట్లు అభివద్ధి చేయాలేదని కురగల్లు గ్రామానికి చెందిన రైతు తోట రామారావు పేర్కొన్నారు. అదే విధంగా అసైన్డ్ భూమిల్చిన రైతులకు నేటికి కౌలు ఇవ్వలేదన్నారు. కురగల్లు గ్రామస్థులు గూడారి గోపాలకష్ణ మాట్లాడుతూ ఆర్ 5 జోన్ వివాదం కోర్టు పరిధిలో ఉండగా, సీఆర్డీఏ పనులు ప్రారంభించటం సరికాదన్నారు. అభ్యంతరం వ్యక్తం చేసిన మాపై పోలీసులు దురసుగా వ్యవహరించారని, సెల్ ఫోన్ బలవంతంగా లాక్కొని పగలుగొట్టారని వివరించారు. పోలీస్ స్టేషన్ వద్ద అమరావతి జెఎసి నాయకులు ధనేకుల రామారావు, బెల్లంకొండ నరసింహరావు, పువ్వాడ సుధాకర్, కళ్లం రాజశేఖరరెడ్డి, ఆకుల ఉమామహేశ్వరరావు, చిలక బసవయ్య తదితరులు నిరసన తెలిపారు.

ఐనవోలులో ఆర్ 5 జోన్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద అరెస్టులకు నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

జిల్లాలో ఘనంగా రంజాన్ వేడుకలు

గుంటూరులో రంజాన్ నమాజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

2లో

నేడు జీర్ణకోశ వ్యాధులపై ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ్య సభలలో భాగంగా లివర్, జీర్ణకోశ వ్యాధులపై అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లో అవగాహన సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో రమేష్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ లోకేష్ పాల్గొని ప్రసంగిస్తారని తెలియజేశారు. కావున అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గ్రామానికి చెందిన కీర్తిశేషులు మాజీ సర్పంచ్ జొన్నాభట్ల సూర్యనారాయణ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు గ్రామంలోని రాజగోపాలస్వామి దేవాల యంలో శుక్రవారం రాత్రి సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సత్య హరిచంద్ర నాటకాన్ని తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలనాటి కలలను ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉందని, నాన్న జ్ఞాపకార్థం గ్రామంలో సత్య హరి చంద్ర పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించినట్లు వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు సతీష్ శర్మ తెలియజేశారు.

నివాళులర్పిస్తున్న నాయకులు ,తదితరులు

లెనిన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - గుంటూరు

మార్క్సిస్ట్ మహోపాధ్యాయులు, సోషలిస్టు రష్యా నిర్మాత లెనిన్ 153వ జయంతి, సిపిఐ (ఎంఎల్) పార్టీ ఆవిర్భావ సభను శనివారం స్థానిక అరండల్ పేటలోని మాదల నారాయణ స్వామి భవనంలో నిర్వహించారు. ముందుగా పార్టీ జండాను పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు విష్ణు ఎగురవేశారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ, ప్రజా సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ వర్గ పోరాటాలతో పెట్టుబడి దారి వ్యవస్థను కూల్చి కార్మిక రాజ్యాన్ని స్థాపించవచ్చని లెనిన్ రష్యాలో నిరూపించారని అన్నారు. అనేక సిద్ధాంత గ్రంథాలను రచించారని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. దేశ సంపదను కారుచౌకగా ఆధాని, అంబానిలకు కట్టాబెడుతున్నారని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి చూస్తున్నారని, 4 లేబర్ కోడ్లతో కోట్లాది మంది కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు.

ఈ ప్రజా వ్యతిరేక విధానాలను త్రిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు గనిరాజు, ఎఐకెఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ పోతురాజు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు టి నాగేశ్వరరావు, ఎన్‌వి కృష్ణ , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా టిడ్కో ఇళ్లు

- డీడీలు కట్టి ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- నేటికి మీనమేషాలు లెక్కిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

వినకొండలో నిరుపయోగంగా ఉన్న టిడ్కోఇల్లు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ పట్టణంలో 4028 మంది లబ్ధిదారులను గుర్తించి అప్పటి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సహకారంతో పట్నంలోని వెల్లటూరు రోడ్డులో కొండ వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి మొదటిగా 1480 ఇళ్లకు శంకుస్థాపన చేసి మొదలుపెట్టారు. అర్హులైన లబ్ధిదారుల నుండి వినుకొండ మున్సిపాలిటీ డీడీలు సేకరించింది. 2019 నాటికి 90శాతం ఇంటి నిర్మాణాలు పూర్తి కాగా ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్ల నిర్మాణం నిలిపివేసింది. దీంతో పేద ఇంటి కల సహకారానికి తూట్లు పడినట్టు అయింది. అపార్ట్మెంట్లో డబల్ బెడ్ రూమ్, సింగల్ బెడ్ రూమ్ కేటగిరి వారిగా లబ్ధిదారులు చేత ప్రభుత్వం అడ్వాన్స్ నగదు డీడీలను తీసుకుంది. ప్రభుత్వం ద్వారా అపార్ట్మెంట్లో మంచి ప్లాటు వస్తుందని భావించిన పేద లబ్ధిదారుల ఆశ నిరాశ గానే మారింది. వినుకొండ పట్టణ పేద లబ్ధిదారులకు ఇవ్వవలసిన టిడ్కో అపార్ట్మెంట్ ప్లాట్లను సంపూర్ణంగా పూర్తి చేసి ఇవ్వకుండానే పేద లబ్ధిదారులకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు అంటూ పాలకుల హడావుడి ప్రజల్లో అసంతృప్తిని నింపింది. టిడ్కో గృహ నిర్మాణాలు నిలిచిపోవటం వలన ఇనుము తుప్పు పట్టి, నిరుపయోగంగా మారాయి. కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టిన ఇల్లు పూర్తి చేసి అర్హులైన పేద లబ్ధిదారులకు అందజేయాల్సి ఉండగా ప్రభుత్వం ఎప్పుడు కేటాయిస్తుందో అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. నిర్మాణం పూర్తయి చివరి దశలో ఉన్న టిడ్కో గహాలను పూర్తి చేసి రంగులు వేసి ఇవ్వాలని అనేకసార్లు ప్రతిపక్షాలు, వామపక్షాలు లబ్ధిదారులకు అండగా ఆందోళన చేపట్టినా ప్రభుత్వానికి చలనం కలగలేదు. నిలిచిపోయిన ఇల్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారుల కేటాయించడంతోపాటు, నిర్మించాల్సిన టిట్కో గహాలను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఉచితంగా పుస్తకాల పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :

పుస్తకాలు చదవడం వలన విజ్ఞానంతో పాటు సామాజిక అంశాలపై కూడా పట్టు పెరుగుతుందని సిద్దార్ధ అకాడమి అధ్యక్షులు డాక్టర్ సి.నాగేశ్వరరావు అన్నారు. పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ వద్దగల సర్వోత్తమ భవన్ నందు ఉచిత పుస్తకాల పంపిణీని శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విజ్ఞానంతో పాటు వికాసం, సామాజిక అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. నేడు పుస్తకాలకు ఆదరణ పెరుగుతుందని, విజయవాడ నగరంలో ఉచితంగా పుస్తకాల పంపిణీ చేయడం మంచి పరిణామమని విద్యార్థులు అందరూ వినియోగించుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ప్రదాన కార్యదర్శి డాక్టర్ రావి శారద మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ఈపుస్తక ప్రదర్శన ద్వారా రెండు లక్షలకుపైగా ఉచితంగా పుస్తకాలను అందించినట్లు తెలిపారు. దాతలు తమకు ఇచ్చిన ఈపుస్తకాలను అందరికీ అందించడం పుస్తక దాత, పుస్తక స్వీకర్తకు కూడా సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఇందులో సాదారణ గ్రంథాలతో పాటు తత్వశాస్త్రం, మతాలు, ఆధ్యాత్మిక, సాంఘిక, భాష, ఇంజనీరింగ్, వైద్య, విజ్ఞాన శాస్త్రాలు, కళలు, తెలుగు, ఆంగ్ల సాహిత్య గ్రంథాలు,చరిత్ర, బాల సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం పుస్తకాలు ఎన్నో ఉన్నాయన్నారు. పదవ, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సంబంధించిన వివిధ విద్యా సంస్థల స్టడీ మెటీరియల్స్‌తో కలిపి దాదాపు 50 వేలకుపైగా పుస్తకాలు ఉన్నాయని, రెండు రోజుల పాటు జరిగే ఈప్రదర్శనలో ప్రతి ఒక్కరూ రెండు పుస్తకాలను ఉచితంగా తీసుకువెళ్లవచ్చని తెలిపారు.

పుస్తకాల పంపిణీ ని ప్రారంభిస్తున్న డాక్టర్ సి.నాగేశ్వరరావు

అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన

- మిగిలిన పనులు సత్వరమే పూర్తి చేయాలి
- కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విగ్రహ పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి-విజయవాడ : నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను పూర్తి చేయాలని క్వాలిటి కంట్రోల్ అధికారులను నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్వరాజ్యమైదానంలో జరుగుతున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు, కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్ పాత్, ల్యాండ్ స్కెఫ్,కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. అన్ని భాగాలు కలిపి చాలా జాగ్రత్తగా విగ్రహ నిర్మాణం చేయాలని కమిషనర్ ఆదేశాలు.ఈ ప్రాజెక్టు అద్భుతమైన ప్రాజెక్ట్ అని.. ఎక్కడ పొరపాట్లు లేకుండా అంబేద్కర్ విగ్రహ నిర్మాణం జరగాలని సూచించారు. ప్రధాన విగ్రహంతో పాటు మిగిలిన పనులు సైతం నిర్దేశించిన సమయంలోపు పూర్తి చెయ్యాలని కాంట్రాక్టర్లను కమిషనర్ ఆదేశించారు. అదేవిధముగా నిర్ణీత గడువు లోపుగా అన్ని అభివద్ధి పనులను పూర్తి చేయాలని, అవసరమైనచో అదనంగా కార్మికులను ఏర్పాటు చేసుకుని,రాత్రి వేళలలో కూడా పనులు వేగవంతం చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుకున్న సమయానికి అంబేద్కర్ స్మృతివనం, విగ్రహం పూర్తి చేయాలని కాంట్రాక్టర్స్ కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఎపీ.ఐ.ఐ.సీ అధికారులు, కే.పి.సి. ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి రేటింగ్ అండర్ -17 చెస్ టోర్నీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పోరంకిలోని గ్రీన్ స్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి రేటింగ్ అండర్ -17 బాలికల చెస్ టోర్నమెంట్ మూడవరోజు ఆటను కె.ఎల్.యూ. స్పోర్ట్స్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ డాక్టర్ కె.సుజాత, మెప్మా స్టేట్ మిషన్ మేనేజర్ యన్.యన్. ఆర్.శ్రీనివాస్ మొదటి ఎత్తు వేసి ప్రారంభించారు. శనివారం పాఠశాల ఆవరణలో మూడవరోజు టోర్నమెంట్ ఉత్సాహభరితంగా జరిగింది. టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ ఎ.ఉదయకుమార్ సమక్షంలో ఆడిట ఆట డ్రాగా ముగిసింది. ఆటోర్నమెంట్‌లో మొత్తం 50 మంది క్రీడాకా రిణులు పాల్గొంటున్నారని కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ యన్.యం. ఫణికుమార్ తెలిపారు. ఈపోటీలలో ప్రతిభ కనపరచిన ఇద్దరు క్రీడాకారిణులను మే 1వ తేదీ నుండి 9 తేదీ వరకు పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి చెస్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు.

భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిది

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచం ధరిత్రి దినోత్సవం సందర్భంగా స్థానిక టి.జె.పి.యస్. కళాశాల లో శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్ తెలిపారు. మనోహర్ మాట్లాడుతూ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేసినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. అనంతరం 300 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో 'భూమాతను కాపాడండి -మానవాళిని రక్షించండి', 'ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటండి -తల్లి రుణం తీర్చుకొండి', 'ప్లాస్టిక్

నివారించండి -పర్యావరణాన్ని కాపాడండి', 'పరిసరాలను శుభ్రంగా ఉంచండి - ప్రపంచానికి ఆరోగ్యం ఇవ్వండి' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్. యస్. అనితా దేవి, వైస్ ప్రిన్సిపాల్. (భాను మురళి, సి. పి. టి. క్యాంపస్ ఇంచార్జ్ జి. సురేష్ బాబు, జాతీయ సేవా పథక కార్యక్రమ అధికారి డాక్టర్. జె.వి.సుధీర్ కుమార్, యస్. సి. సి. అధికారి మేజర్. పి.కుమార్ రాజా, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ తరహా కార్యక్రమాలు చేసిన అధ్యాపక బృందాన్ని,విద్యార్థులను కళాశాల సెక్రటరీ,కరెస్పాండంట్ తెల్లాకుల శ్రీనివాస బాబు అభినందించినట్లు తెలిపారు.

పదవులు ఆశించడం లేదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పదవులు ఆశించి బీజేపీలో చేరలేదని ప్రజా సేవకోసమే రాజకీయాలలోకి వచ్చాననీ పారిశ్రామిక వేత్త తులసి రామచంద్ర ప్రభు తెలిపారు. గుంటూరులోని ఒక ఫంక్షన్ హాలు లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు రాజకీయాలు తెలియవనీ, 2009లో తాను ఒక నెల రోజులు మాత్రమే రాజకీయాలలో వున్నాననీ ఆ తరువాత మళ్లీ రాజకీయాలకి దూరంగా ఉన్నట్లు తెలిపారు.కేంద్రలోని నరేంద్రమోడీ ప్రభుత్వం, పార్టీ సిద్ధాంతాలు నచ్చి బిజెపి లో చేరాననీ తెలిపారు.బిజెపి జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకష్ణ, పార్టీ నాయకులు సుధాకర్ యాదవ్, చందు సాంబశివరావు మాట్లాడుతూ రామచంద్ర ప్రభు గారు పేద విద్యార్థిని విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందించి ఉన్నత విద్యలకు దోహదపడ్డారని కొనియాడారు.విత్తనాభి వద్ధి సంస్థలో నూతన వరవడులు సష్టించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఇచ్చే ఉత్పత్తులను తయారు చేసిన తులసి సీడ్స్ అధినేత గా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. తులసి సీడ్స్ ఆధ్వర్యంలో వేలాది మందికి ఉద్యోగ కల్పన సష్టించి 12 సంస్థలను దేశవ్యాప్తంగా నిర్మించారనీ తెలిపారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ఈద్గాల వద్ద ముస్లింల ప్రార్థనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఈద్గాలు, మసీదులలో ముస్లింలు, పెద్ద సంఖ్యలో ప్రార్థనలు నిర్వహించారు. గుంటూరు నగరంలోని రమేష్ హాస్పిటల్, ఆంధ్రా ముస్లిం కాలేజీ, ఉర్దూ బాలుర పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రార్థనల్లో నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, జిల్లా ఎస్పి ఆరీఫ్ హాఫీజ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, మైనార్టీ విభాగం సలహదారుడు జియా ఉద్దీన్, టిడిపి నాయకులు డేగల ప్రభాకర్, నశీర్ అహ మ్మద్,కోవెల మూడి రవీంద్ర,కన్నా నాగరాజు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్దలతో కఠిన ఉపవాసం పాటించిన ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు.

వైసిపి ఎస్సీ సెల్ నేత పై దాడికి యత్నం

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరుకు చెందిన టిడిపి ప్రచార కార్యదర్శి గడ్డం వెంకటేశ్వరరావు తనపై దాడి యత్నానికి పాల్పడ్డాడని వైసిపి ఎస్సీ సెల్ నాయకులు శంగారపాటి సందీప్ పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. తాను కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో ఉన్న సమయంలో వెంకటేశ్వరరావు కొంత మందిని వెంట బెట్టుకొని టిడిపి జెండాలు పట్టుకొని వచ్చి దుర్భాష లాడుతూ ఊళ్ళో ఎలా తిరుగుతావో చూస్తానని బెది రించాడని ఆ ఫిర్యా దులో పేర్కొన్నారు. 'ఎర్రగొండ పాలెంలో చంద్రబాబుపై రాళ్లతో దాడి చేస్తావా?' అని తన బెదిరించాడని సందీప్ ఆరోపించారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు

అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని ఉద్దండరాయునిపాలెం లో జరిగింది. సిఐ ఎం.ఆనందరావు తెలిపిన వివరాల ప్రకారం, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం గ్రామానికి చెందిన మేడబలిమి ఆది నరసింహులు (55) తన భార్య మల్లీశ్వరితో కలిసి ఆరేళ్ల నుంచి ఉద్దండ రాయునిపాలెం లంకలో నివసిస్తున్నాడు.నరసింహులుకి మద్యం తాగే అలవాటు ఉంది. శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో బయటకు వెళ్లొస్తానని భార్యకి చెప్పి వెళ్లిన నరసింహులు, తిరిగి ఇంటికి రాలేదు. లంక పొలంలో నరసింహులు పడి ఉన్నాడని చుట్టుపక్కల వారు శనివారం చెప్పడంతో మల్లీశ్వరి అక్కడికి వెళ్లింది. చలనం లేకుండా పడివున్న అతని శరీరంపై దోకుడు గాయాలు ఉన్నాయి.మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నరసింహులు దంపతులకు ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు.

మృతి చెందిన ఆది నరసింహులు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-తెనాలి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిగా, మరొకరు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. రూరల్ ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రూరల్ గ్రామం హాఫ్‌పేట -తంగేళ్లమూడి అడ్డరోడ్డు మధ్యలో శనివారం ఇద్దరు వ్యక్తులు బైక్ పై వెళ్తుండగా వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గుంటూరు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్న శ్రీరాములు (54) మృతి చెందాడు. శ్రీరాములు బాపట్ల జిల్లా కొల్లూరు మండల కేంద్రానికి చెందిన వ్యక్తి. మృతుని కుమారుడు చైతన్యబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహాన్ని బయటకు తీసిన గజ ఈతగాళ్లు

ప్రజాశక్తి-బెల్లంకొండ

పులిచింతల బ్యాక్ వాటర్ లో శుక్రవారం మునిగి గల్లంతైన రమణబోయిన పెద ఆల్లయ్య (46) మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సహాయంతో శనివారం ఉదయం వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై అమీర్ తెలిపారు. మండలంలోని ఎమ్మాజీగూడెంలో గేదెలు కాసేందుకని వెళ్లి మృతి చెందిన ఆల్లయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో కొనకంచివారిపాలెంలో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వీర్ల శ్రీనివాసరావుకు చెందిన ఎకరము పొలంలో సాగు చేస్తున్న మొక్కజొన్న అగ్నికి ఆహుతైంది. అలవాల గ్రామం వైపున గల పొలాల నుండి వస్తున్న మంటలకు తమ పొలంలో సాగు చేస్తున్న పంట దగ్ధమైందని శ్రీనివాసరావు చెప్పారు. రెండు రోజుల క్రితం మొక్కజొన్న కండెలు కోసి పొలంలో కుప్పగా వేశామని, రాత్రి సమయంలో బాగా మబ్బులు పట్టడంతో వర్షం కురిసి కండెలు తడుస్తాయనే ఉద్దేశంతో వాటిపై పరదా కప్పామని అన్నారు. మరుసటి రోజు పొలం వద్దకు వెళ్లి చూసే సరికి పంట మొత్తం అగ్నికి ఆహుతై ఉందన్నారు. మంటలలో తగులపడుతున్న మొక్కజొన్న కండెలను బయటకు తీసేందుకు యత్నించిన కుదర్లేదని చెప్పారు. ప్రమాదంలో సుమారు 30 క్వింటాళ్ల మొక్కజొన్న కండెలు దగ్ధమయ్యాయని, సుమారు రూ.60 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను

శ్రీ త్రికోటేశ్వర కన్‌స్ట్రక్షన్ & డెవలపర్స్ **నరసరావుపేట** నందు పని చేయుటకు అనుభవం కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Qly:- ఇంటర్/డిగ్రీ.

Cell No: 9347934770, 9030934770

నిధులున్నా .. నెలవేరని కల!

- మోడల్ ఫిష్ మార్కెట్ నిర్మాణం జరిగేనా?
- పునాదులు దాటని భవన నిర్మాణాలు
- రోడ్ల పక్కనే చేపల అమ్మకాలు.. విక్రయదారుల ఇబ్బందులు

చిలకలూరిపేటలోని గడియారం స్తంభం దగ్గర చేపలు అమ్ముతున్న విక్రయదారులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో నూతనంగా నిర్మించనున్న అధునాతన చేపల మార్కెట్ కోసం అమ్మకందారులు ఎదురు చూస్తు న్నారు. తమ కల నెరవేరితే రోడ్డు పక్కన విక్రయించాల్సిన పరిస్థితి ఉందని చేపల విక్రయదారులు చెబుతున్నారు.గత ప్రభుత్వ హయాంలో వ్యవ సాయ, మత్స్య శాఖ మంత్రిగా ఉన్న పుల్లారావు పట్టణంలోని చంద్రమౌళి మాంసం, చేపల మార్కెట్‌ను రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా ఆధునికీకరించి, అధునాతన సౌకర్యాలతో మోడల్ ఫిష్ మార్కెట్‌ను నిర్మించనున్నట్లు నాడు ప్రకటించారు.

2016- 17 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర మత్స్యశాఖ 84.80 లక్షల రూపాయలను మంజూరు చేసింది. సదరు చెక్కును అప్పటి మంత్రి పుల్లారావు సమక్షంలో మత్స్య శాఖ జెడి బలరామమూర్తి, నాటి మున్సిపల్ చైర్‌పర్సన్ గుంజి చెంచు కుమారి, మున్సిపల్ అధికారు లకు అందించారు. అయితే, 2019లో పనులు ప్రారంభించడం, ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పునాదులు దశలోనే పనులు నిలిచిపోయాయి. వైఎస్‌ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం 10 శాతం పనులు కూడా పూర్తికాని ఫిష్ మార్కెట్ టెండర్లను రద్దు చేశారు. పాత టెండర్లను రద్దు చేయడం, నూతనంగా టెండర్లు పిలవకపోవడంతో చేపల మార్కెట్ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయనేది ప్రశ్నార్థకంగా మిగిలింది.

పట్టణ నడిబొడ్డున ఉన్న కస్తూరిబా రోడ్డులోని చంద్రమౌళి కూరగాయల మార్కెట్ పక్కనే చేపలు, మాంసం విక్రయించే దుకాణాలు ఉన్నాయి. ఇందులో 15 దుకాణాల్లో చేపలు, 8 దుకాణాల్లో మటన్, 9 దుకాణాల్లో చికెన్ విక్రయి స్తుంటారు. చిలకలూరిపేటకు 40 కిలో మీటర్ల దూరంలో ఉన్న చీరాల, బాపట్ల, నుంచి సముద్రపు చేపలు రొయ్యలను, మార్టూరు తదితర ప్రాంతాల నుంచి చేపలు, కోళ్లను, నాటుకోళ్లను ప్రత్యేకంగా ఈ మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. అంతేకాకుండా, ఉభయగోదావరి, కృష్ణ, నెల్లూరు జిల్లాలో చెరువుల్లో సాగు చేస్తున్న చేపలు, రొయ్యలను కూడా ఇక్కడ అమ్ముతుంటారు. అంత వ్యాపారం జరిగే చిలకలూరిపేట పట్టణంలో ప్రత్యేక చేపల మార్కెట్ లేకపోవడం దురదృష్టకరం.

పట్టణంతో పాటుగా చుట్టు పక్కల ప్రాంతాల వారు ఇక్కడికి వచ్చి చేపలు కొనుగోలు చేస్తుంటారు. సుమారు 50 ఏళ్లుగా దేదీప్యమానంగా వెలుగొందిన ఈ మార్కెట్ కు ఆధునికీకరణ పనులు జరగక మూలనపడింది. దీని గురించి పట్టించుకునే నాథుడే లేరు. మార్కెట్లో తూతూ మంత్రంగా ఉన్న చిన్నపాటి రేకుల షెడ్లు కూడా ప్రస్తుతం రోడ్డుకు దిగువన లోతట్టులో ఉండటంతో అమ్మకందారులు, కొనుగోలు దారులకు ఇబ్బందులు తప్పట్లేదు. చిన్నపాటి వర్షం కురిస్తే దుకాణాల్లోకి నీరు చేరుతోంది.

పునాదులకే పరిమితమైన చేపల మార్కెట్ నిర్మాణాలు

కొద్దిపాటి ఎత్తులో రోడ్లను నిర్మించేందుకని కెబి రోడ్డును ఆనుకొని ఉన్న కొన్ని దుకాణాలను తొలగించారు. కొంత మేర రోడ్లు, కాలువ నిర్మాణం అనంతరం దుకాణదారుల సొంత డబ్బులతో కాలువలపై దుకాణాలు నిర్మించుకున్నారు. అయితే ఆ దుకాణాలు సక్రమంగా లేక పోవడంతో కొద్దిపాటి సరుకును తెచ్చు కుని నిల్వ చేసే పరిస్థితి. ఆయా దుకాణాల వద్ద చేపలు అమ్మకాలకు వీళ్ళు లేనందున రోడుపై పెట్టుకుని అమ్ముకోవాల్సి వస్తోందని చేపల అమ్మకందారులు చెబుతు న్నారు. రోడ్డుపై అమ్మకాలు నిర్వహించడం కష్టంగా మారిందని, చేపలు, రొయ్య లు నిల్వ చేసుకునేందుకు కూడా వీలు లేకుం డా పోయిందని అంటున్నారు. కొత్త చేపల మార్కెట్‌ను త్వరగా కట్టించి తమ దుకాణాలను కేటాయించాలని మున్సి పల్ అధికారులను చేపల విక్రయదారులు కోరుతున్నారు.

ఒక కోటి ఆరు లక్షల రూపాయల అంచనాలతో మళ్లీ కొత్త ప్రతిపాదనలతో ఫిష్ మార్కెట్ నిర్మాణం,నిర్వాహణ బాధ్యతలను స్థానిక మున్సిపాలిటీకి అప్పగించారు. ఇందులో రాష్ట్ర మత్స్యశాఖ వాటా కింద 84 లక్షల 80 రూపాయలు కాగా, మిగిలిన అదనపు నిధులను సుమారు రూ.22 లక్షలను మున్సిపల్ నిధుల నుంచి ఖర్చు చేయాల్సి ఉంటుంది. మార్కెట్ అవసరాలు కనుగుణంగా రెండు అంతస్తుల భవనానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. భవనం కింద భాగంలో 14 దుకాణాలు, పైభాగంలో చేపలు, రొయ్యలు నిల్వచేసుకునేందుకు లాకరుతో కూడిన గోడౌను, చిన్న కోల్డ్ స్టోరేజ్ లాంటివి సిద్ధం చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.

ఇందులోనే చేపల దుకాణాలతో పాటు ప్రస్తుతం ఉన్న చికెన్,మటన్ దుకాణాలకు గదులను కేటాయించ నున్నారు. తాగునీరు,మురుగునీరు పారుదల, వాహనాలు పార్కింగ్,మరుగుదొడ్లు తది తర సౌకర్యాలు కూడా కల్పించడానికి సిద్ధం చేశారు. అయితే, ప్రస్తుతం సుమారు 12 సెంట్ల స్థలం మాత్రమే ఉండటంతో ఇది కొంత సమస్యగా మారింది. 25 సెంట్ల స్థలం ఉంటే బాగుంటుందని టౌన్ ప్లానింగ్, రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు.

మత్స్య శాఖ ముందుకొస్తే సహకరిస్తాం

అప్పట్లో ఆధునాతన టెక్నాలజీతో మార్కెట్ నిర్మించాలని మత్య శాఖ నుంచి గ్రాంట్ మంజూరైన మాట నిజమేనని ప్రస్తుత కమిషనర్ సిహెచ్ గోవింద రావు అన్నారు. అప్పట్లో మంజూరైన నిధులు అలాగే ఉన్నాయని, మత్స్య శాఖ ముందుకు వస్తే తాము ఫిష్ మార్కెట్ నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు. కొత్తగా ప్లాన్, బిల్డింగ్ ప్రణాళికలను సిద్ధం చేశామని, అప్పటి అధికారులు ఎవరూ మత్స్య శాఖలో లేరని అన్నారు..

'బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపి.. దేశాన్ని కాపాడుకుందాం'

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని, దేశాన్ని కాపాడుకుందాం అని సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు గుంటుపల్లి బాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పుతుంబాక భవన్ వద్ద సిపిఎం,సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారభేరి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ , సిపిఐ నియోజకవర్గ నాయకులు నరిసేటి వేణుగోపాల్ లు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రతి వ్యక్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి మోడీ అమీత్ షాల నాయకత్వంలో బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చును రాజేస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను,బ్యాంకింగ్ వ్యవస్థలను కార్పొరేట్లకు కట్టబెటేందుకు శాయశక్తులా కృషి చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దుంప నాశనం చేసి, ఆహార ధాన్యాల కోసం అమెరికా వంటి దేశాలపై ఆధారపడేటట్లు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని అన్నారు. ప్రచారభేరిలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సత్తెనపల్లిలో..

కార్యక్రమంలో సిపిఎం నాయకులు అనుముల వీరబ్రహ్మం,పి ప్రభాకర్, గడ్డం సుసులోవ్, జడ రాజ్ కుమార్, దామర్ల వెంకటేశ్వర్లు, ఎం.హరిపోతురాజు,బిట్రా నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, రొంపిచర్ల పురుషోత్తం, సిపిఐ నాయకులు ఇర్మియ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

సిపిఎం,సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో జరిగే ప్రచార బేరి కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాదల రామాలయం సెంటర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సిహెచ్.నాగమల్లేశ్వర రావు, పఠాన్ సైదాఖాన్, జి. జాలయ్య, కె. సాంబ శివరావు, ఎం.వెంకటరెడ్డి పాల్గొన్నారు

ముప్పాళ్లలో..

నివాళులర్పిస్తున్న అనుముల లక్ష్మీశ్వరరెడ్డి

కూచిపూడి ఆరోగ్యం మృతికి సంతాపం

ప్రజాశక్తి- బెల్లంకొండ

బెల్లంకొండ మండలం నందిరాజుపాలెం గ్రామానికి చెందిన కూచిపూడి ఆరోగ్యం (పాములు) (92) మతికి వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అను ముల లక్ష్మీశ్వరరెడ్డి సంతాపం తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం 10 గంటలకు మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం నాయకుల బృందం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాటాడుతూ పాములు గత నలభై ఏళ్లుగా సిపిఎం సభ్యుడుగా, సానుభూతిపరుడుగా ఆయన ఉన్నారని, వ్యవసాయ కార్మిక సంఘంలో ముఖ్య కార్యకర్తగా పనిచేశారని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన అనేక భూ పోరాటాల్లో ఆయన ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. పాములు అంత్యక్రియల కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిమ్మిశెట్టి హనుమంతరావు, సిపిఎం మండల కార్యదర్శి చిన్నం పుల్లారావు, సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ ఆవుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు సిపిఎం నాయకుల నివాళి

ప్రజాశక్తి- నరసరావుపేట

లెనిన్ జయంతి సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో మస్తాన్ వలి అధ్యక్షతన శనివారం ఓ కార్యక్రమం నిర్వహించారు. లెనిన్ చిత్ర పటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు డి.శివకుమారి,పట్టణ శాఖ కార్యదర్శి సిలార్ మసూద్, సిపిఎం సీనియర్ నాయకులు ఎవికె దుర్గారావు, ఎస్‌డి హుస్సేన్, ఎస్‌డి రబ్బాని, బోసు నాగమ్మ, సుభాని పాల్గొన్నారు.

భూ పరిరక్షణపై అవగాహన అవసరం

ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్

ప్రజాశక్తి-బెల్లంకొండ

ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా బెల్లంకొండ మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ శనివారం పర్యావరణ పరిరక్షణ-తక్షణ కర్తవ్యం, భూ పరిరక్షణపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఉష్ణోగ్రతల పెరుగుదల సమస్త జీవజాలంపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని జరుపు కుంటున్న తరుణంలో పర్యావరణ పరిరక్షణ బాధ్యతను మరోసారి స్మరణకు తెచ్చుకొని, ఎవరికివారు తమ వంతు కృషి చేసేందుకు ప్రతిన బూనాల్సిన అవసరం ఉందన్నారు .వీలున్నంతవరకు రీ సైక్లింగ్ కు అవకాశం ఉండే వస్తువులే ఉపయోగించాలని, విరివిగా మొక్కలు నాటాలని, వ్యవ సాయంలో రసాయనాలు ఇష్టానుసారంగా వాడటం మాను కోవాలని, భూమికి హాని చేసే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు.

మతోన్మాద బిజెపిని గద్దె దింపాలి

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో వాడవాడలా ప్రచార భేరీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరీ మండలంలోని ఎర్రబాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడారు. దేశ అభివద్ధికి ఆటంకంగా ఉన్న మోడీని ఎంత తొందరగా ఇంటికి పంపిస్తే దేశానికి అంత మంచిదన్నారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, దొడ్డిదారిలో మనుధర్మ శాస్త్రాన్ని తీసుకొచ్చి భారత ప్రజల నెత్తిన రుద్దాలని చూస్తుందని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం జోలికొస్తే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని చెప్పారు. ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు స్థాపించడం చేతకాని ,చావలేని బిజెపి ప్రభుత్వం ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు అమ్మే అధికారం ఎవరిచ్చారని వారు ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ప్రైవేటు వరం చేయడం బిజెపి తరం కాదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానులు అంటుంటే ఏమి చేయలేని చేతకాని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రుల బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేస్తూ ఉంటే పౌరుషం ఉన్న ఆంధ్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని బిజెపినీ శంకరగిరి మాన్యాలకు పంపిస్తారని వారు హెచ్చరించారు. రాజధాని అమరావతి పై కల్లబొల్లి మాటలు చెప్పడం మాని కేంద్ర ప్రభుత్వం ఈప్పటికైనా రాజధాని అభివద్ధికి నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, డివిజన్ నాయకులు ఎస్కె ఎర్ర పేరు, కె రామకష్ణ, నానయ్య, ఉయ్యాల ఆంథోని ,సిపిఐ మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, నియోజకవర్గ నాయకులు కంచర్ల కాశయ్య ,సాంబిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎర్రబాలెంలో మాట్లాడుతున్న ఎం రవి

చినకాకానిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఈమని అప్పారావు తదితరులు

పెనుమాకలో సిపిఎం, సిపిఐ ప్రచార భేరీ

కొలనుకొండ ప్రచారభేరీలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వెంకటరెడ్డి

ఫిరంగిపురం మండలంలో ప్రచారం నిర్వహింస్తున్న సిపిఎం నాయకులు

తాడికొండలో సిపిఎం, సిపిఐ నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదామని దేశాన్ని కాపాడుకుందాం అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఈమని అప్పారావు అన్నారు. మంగళగిరి రూరల్ మండలం చినకాకాని గ్రామంలో శనివారం సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో రాజకీయ ఆందోళన ప్రచార బేరి నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాల కాలంలో నిత్యవసరకుల ధరలను విపరీతంగా పెంచిందని, మందుల ధరలు పేదవారికి అందుబాటులో లేకుండా చేశారని, పెట్రోల్ డీజిల్ ధరలు నానాటిక ఆకాశాన్ని అంటుతున్నాయని, గ్యాస్ ధరలు పేదవాడికి అందుబాటులో లేకుండా పోయిందని తెలిపారు. అలాగే ప్రజల పన్నులతో ఏర్పాటు చేసినటువంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసి, జిఐసి, బ్యాంకులను, పోర్టులను, విమానయానాన్ని గనులను కారు చౌకగా ఆదానీ అంబానీలకు అమ్ముతున్నారని విమర్శించారు ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని దేశాన్ని కాపాడాలని నినాదంతో సిపిఎం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాజకీయ ఆందోళన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గంలో ఈనెల 24వ తేదీన బహిరంగ సభ జరుగుతున్నట్లు ఈ సభకు సిపిఎం పార్టీ సభ్యులు పోలిట్ బ్యూరో సభ్యులు బి.వి .రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొంటారని సభలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు కాజ శంకర్రావు, కే .దాసు,కే .సాంబశివరావు ,బ్రహ్మం, సుబ్బారావు ,కటారి జేసుదాసు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ప్రజలను కడగండ్ల పాలు చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి కోరారు. శనివారం పెనుమాక డాబాల సెంటర్‌లో జరిగిన సిపిఎం, సిపిఐ ప్రచారభేరి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.భాగ్యరాజు, వి.వెంకటేశ్వరరావు, ఎస్‌కె పీరూసాహెబ్, సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్నతిరుపతయ్య, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ, దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీని గద్దరించే వరకు పోరాడాలని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో సిపిఎం సిపిఐ ప్రచార భేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వాన కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నాటి బ్రిటిష్ పాలకుల కంటే దుర్మార్గంగా పరిపాలన సాగిస్తుందని ఆయన అన్నారు. నిరంకుశంగా, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, ప్రజలపై భారాల వేస్తున్న బిజెపిని దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఆయన అన్నారు. రైతుల మెడ పై ఉరి తాళ్ళుగా ఉన్న మూడు నల్ల చట్టాలను రద్దు చేసే అంతవరకు సంవత్సరం కాలం పాటు దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమం మహా ఉద్యమంలా ఢిల్లీ కేంద్రంలో జరిగిందని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. దేశవ్యాప్తంగా రైతులు చేసిన పోరాటానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం తలవంచక తప్పలేదని అన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరాసిందని ఆయన అన్నారు. మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా 24వ తేదీన మంగళగిరిలో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన హామీలు ఇచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు బడ్జెట్లో నిధులు కేటాయించకుండా అన్యాయం చేశారని సిపిఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కష్ణ, సిపిఎం కొలనుకొండ గ్రామ శాఖ కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, కాట్రగడ్డ శ్రీనివాసరావు, గొట్టిపాటి కోటేశ్వరరావు, శివయ్య, పీకా రవి, బాలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మతోన్మాద బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందామంటూ సిపిఎం, సిపిఐ ప్రచార భేరీని మండలంలోని పొనుగుపాడు, మేరకపూడి, నుదురుపాడు, కండ్రిక, వేమవరం, రేపూడి, తక్కెళ్లపాడు, 113 తాళ్లూరు, శిరంగిపాలెం, బేతపూడి, గుండాలపాడు, ఎర్రగుంట్లపాడు తదితర గ్రామాల్లో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ఎం వలి, నాయకులు సిహెచ్ ఎస్ వల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రజాశక్తి - తాడికొండ

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండకడుతూ శనివారం సిపిఐ సిపిఎం పార్టీలు ప్రచార భేరీ నిర్వహించాయి, పొన్నెకల్లు, నిడుముక్కల, మోతడక లామ్, తాతిరెడ్డి పాలెం, జొన్నలగడ్డ గ్రామాలలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకర్ రావు, సిపిఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, రైతు సంఘ నాయకులు ఇమ్మడి రామారావు, కనగాల పూర్ణచంద్రరావు, బి భద్రయ్య పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ రామరాజుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్టీఆర్ శక పురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం, ఆదివారం ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై, నటించిన సినిమాలపై, ఆయన రాజకీయ జీవితంపై జరిగే సదస్సును కొత్తపేట పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఉత్సవాల్లో రోజుకొక కళా కారుడిని సన్మానించే కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సాంఘిక కళా కారుడు, ఫొటోగ్రాఫర్ వేమురాజు రామరాజు ను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి ఎన్టీఆర్ జ్ఞాపికను అంద జేశారు. కార్యక్రమంలో వక్తలు డాక్టర్ ఎం బి నాగేశ్వరరావు, మహ్మద్ ఆయాజుద్దీన్ లు ముస్లింలు కోసం ఎన్టీఆర్ సినిమాలు అనేఅంశంపై ప్రసంగించారు. అనంతరం వక్తలనూ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, డి.భవాని, ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు, కె ఏడు కొం డలు, కుమారస్వామి, శంకర్, వెంకట్, గంటయ్య పాల్గొన్నారు.

రామరాజు, నాగేశ్వరరావు, అయాజుద్దీన్ లను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మొక్కజొన్న రైతులతో సిపిఐ,సిపిఎం నాయకులు

రైతుల సమస్యలపై స్పందించని ప్రభుత్వం

ప్రజాశక్తి-తెనాలి

కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలతో రైతులకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారని సిపిఎం సీనియర్ నాయకులు ములక శివ సాంబిరెడ్డి అన్నారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారయాత్ర రూరల్ గ్రామాలు కోపల్లె, గుడివాడలో శనివారం కొనసాగింది. ఆయా గ్రామాల్లో జొన్న ,మొక్కజొన్న రైతులతో ఆయన మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.1792గా ప్రభుత్వం ప్రకటించినా ఆ మేరకు ఎక్కడా కొనుగోళ్లు జరగడం లేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఎరువులకు కేటాయించాల్సిన నిధులు దాదాపు రూ.25 కోట్లు తగ్గించడం వల్ల వాటి ధరలు రైతులకు భారంగా పరిణమించనున్నాయన్నారు. సిసిఐ, ఎఫ్‌సిఐలను మూసివేయడం, ధాన్యం కొనుగోళ్లకు నిధులు కేటాయింపులు తగ్గించడం వంటి పరిణామాలు రైతులకు శాపంగా మారుతున్నాయన్నారు. రైతులను నష్టాల ఊబిలోకి నెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని సాగ నంపాలని పిలుపునిచ్చారు. ఎం. సాంబశివ రావు, కె ప్రసాద్, హైమారావు, ఓబులు, రామకృష్ణ పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక కొత్తపేటలోని ధరణి రెసిడెన్షియల్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం జరిగింది. పాఠశాల్లో 2003లో పదోతరగతి చదువుకున్న బ్యాచ్ రైల్వే స్టేషన్ రోడ్డులోని గౌతం గ్రాండ్ హోటల్ వేదికకు చేరారు. పాఠశాల డైరెక్టర్ కోదండరామశాస్త్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా వి.బాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులంతా వారి వారి కుటుంబ నేపథ్యం, ఉద్యో గాలు, వ్యాపారాలు, ఎవరెవరు ఎక్కడ స్థిరపడ్డారన్నారన్న సమాచారాన్ని పరస్పరం పంచుకున్నారు. పాఠశాలలో చదివే రోజుల్లో ఉపాధ్యాయులతో ఉన్న చొరవ తదితర అంశాలను చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రామ పుల్లయ్య, గోపాలాచార్యులు, అలేఖ్య, సుభాష్ చంద్రబోస్, హిమజ, రవికుమార్, మంజుసాయి, పి.శ్రీనివాస్‌రావు, పూర్ణిమ, బసవయ్య, పావని, శారదలను సత్కరించారు.

తాడేపల్లిలో ఘనంగా రంజాన్

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలో శనివారం రంజాన్ వేడు కలు ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. నులకపేటలోని ఈద్గా మైదానంతో పాటు నోరాని జామియా మసీద్, ఒటో వార్డు, ఆర్ఎంఎస్ కాలనీ, పోలకంపాడు, మహానాడు మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హజరత్ జలీల్ మాట్లాడుతూ నెల రోజుల పాటు దీక్షగా ఉపవాసం ఆచరించి అందరూ సోదరభావంతో పండుగ జరుపుకుంటు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదుల అధ్యక్షులు ఎస్‌కె సలీంబాష, ఎస్‌కె బాష, ఎస్‌కె బాబు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి పిడతల ఝాన్సీ

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-యడ్లపాడు

ప్రజల దాహార్తిని తీర్చేందుకు యడ్లపాడు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట తాగునీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఎంపీపీ పిడతల ఝాన్సీ ప్రారంభించి స్థానికులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

గణపవరం సొసైటీ ఛైర్మన్ మంగు ఏడుకొండలను సన్మానిస్తున్న సిఇఓలు

నూతన సొసైటీ ఛైర్మన్‌లకు సన్మానం

ప్రజాశక్తి -నాదెండ్ల

మండలంలోని గణపవరం సొసైటీ ఛైర్మన్‌గా మంగు ఏడుకొండలు, నాదెండ్ల సొసైటీ ఛైర్మన్‌గా వెంకటరెడ్డిలు నియమితులైయ్యారు. శనివారం సొసైటీలోని సిఇఓలు అంజియ్య, లక్ష్మయ్యలు వారిచేత మినిట్స్ బుక్‌లో సంతకాలు చేయించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ఛైర్మన్లను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లాడి రవి, కాట్ రమేష్, జడ్‌పిటిసి మస్తాన్‌రావు, తదితరులు పాల్గొన్నారు

యువకుని అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-తాడేపల్లి

యువకుడు అదృశ్యంపై తల్లిదండ్రులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని మహానాడు ఒకటో లైన్‌కు చెందిన 15 ఏళ్ల యువకుడు కగ్గా సూర్యగోపాల్ (యోగి) గురువారం నుంచి కనిపించడంలేదని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని కోరారు. 9542200907 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని

మురికిపూడిలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండలంలోని మురికిపూడిలో శనివారం నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహజంచారు. కార్యక్రమంలో మంత్రి విడదల రజని పాల్గొని మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉండగా కేవలం వారి సొంత ప్రయోజనాల కోసమే పథకాలు అమలు చేశారని మండిపడ్డారు. ఏ కార్యక్రమం చేపట్టినా, ఏ పథకం అమలు చేసినా వాటిల్లో చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నాయకులు వారి స్వలాభం మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-నరసరావుపేట: పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మసీదులలోనూ, ఈద్గాలలోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలో ఆయా గ్రామాలలో గల మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్థానిక ప్రకాష్ నగర్‌లోని ఈద్గా వద్ద జరిగే ప్రార్థనలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

సత్తెనపల్లి టౌన్ : ముస్లీం సోదరులకుపవిత్ర రంజాన్ శుభ్షాంక్షలను రాష్ట్ర మంత్రిఅంబటి రాంబాబు తెలిపారు . శనివారం ఆయన ముస్లీం సోదరులతో కలిసి ఈద్గాలోప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.**తెనాలి:** రంజాన్ పండుగను పట్టణంలోని ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చెంచుపేట ఈద్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పట్టణంలోని 23 మసీదుల పరిధిలోని ముస్లింలు ఈద్గాకు చేరుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. చెంచుపేట హీరామసీద్ ఇమామ్ ముఫ్తీహైదర్ ఆలి సాహెబ్ ఆధ్వర్యంలో ప్రార్ధనలు జరిగాయి. ఈ ఏడాది సౌదీ అరేబియాలోని కాబా, మదీనా నమూనాలు ప్రార్ధనల ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ముస్లింలు వారి పితరుల సమాదులకు నివాళులర్పించారు. రంజాన్ ప్రత్యేక ప్రార్ధనల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి షాదీ ఖానా నిర్మాణానికి అమోదం తెలిపారని, రూ.4 కోట్లు ప్రభుత్వం నుంచి, మరో రూ.2 కోట్లు ఇతర దాతల నుంచి సేకరించి షాదీఖానా నిర్మిస్తామన్నారు. షాదీఖానా నిర్మాణానికి స్థలాన్ని చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. **ముప్పాళ్ల:**-రంజాన్ పండుగ పవిత్రతకు ప్రతీక అనీ సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వై.వి ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రమైనా ముప్పాళ్ల ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధనలో పాల్గొన్న ఆయన దువా నిర్వహించారు.ఈ సందర్భంగా మత పెద్దలకు,సీనియర్ సిటిజన్ కు బట్టలు పంపిణి చేసి ముస్లిం సోదరులకు స్వీట్స్ పంపిణి చేశారు..ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, ఆర్. దేవేంద్రరావు, సర్పంచులు యల్లమంద,చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ పి.నాగేశ్వరరావుత`దితరులు పాల్గొని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్నారు.**వినుకొండ:** వినుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని ఆయా ఈద్గాలు, మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్ లో గల ఈద్గా వద్ద ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ప్రార్థన చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కిన మల్లికార్జునరావులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. **పెదకూరపాడు:** మండలంలోని లగడపాడు, పాటిబండ్ల ,పెదకూరపాడు, తమ్మవరం, చిన్నమెక్కెన గ్రామాలలో రంజాన్ పండుగను ముస్లిములు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈద్గా వద్ద సామూహిక ప్రార్థన నిర్వహించారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. **మంగళగిరిః** పట్టణంలోని వివిధ మసీదు ప్రాంతాలలో రంజాన్ పండుగ భక్తిశ్రద్ధలతో చేశారు. ముస్లిం సోదరులు టోపీలు ధరించి ఒకరినొకరు అలింగం చేసుకొని పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదు ప్రాంతాల్లో డిఎస్పీ జె రాంబాబు, పట్టణ సీఐ బి అంకమ్మరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. **కొల్లిపర:** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని కొల్లిపర మండల గ్రామాల్లో ముస్లిం సోదరులు ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థన నిర్వహించి పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు **నాదెండ్ల:** ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు మండలంలో రంజాన్ పండుగ శనివారం ముస్లిం సోదరులు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పాడి పంటలు బాగా పండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ ఈద్ ముబారక్ అంటూ ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకున్నారు.**దుగ్గిరాల :** మండలంలోని ముస్లిం సోదరులు రంజాన్ ప్రార్ధనలు జరుపుకున్నారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఆలరించారు. మండలంలో ముస్లిం సోదరులు అధికంగా ఉన్న దుగ్గిరాల పెనుమూలి , కంఠంరాజు కొండూరు, చిలువూరు, తుమ్మపూడి రేవేంద్రపాడు గ్రామాలలో ప్రార్ధనలు జరిపారు.**మాచర్ల :** పట్టణంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈద్గా వద్ద జరిగిన ప్రార్ధన సమావేశాలకు ప్రభుత్వ విప్,ఎంఎల్ఎ పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి ముఖ్యఅతిధిగా హజరైయ్యారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, ఛైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కౌన్సిలర్స్, ముస్లిమ్ పెద్దలు షేక్ సుభానిసాహెబ్, సులేమాన్, మదార్‌సాహెబ్, జలీల్ పాల్గొన్నారు.**పిడుగురాళ్ల:** రంజాన్ పండుగ పురస్కరించుకొని పట్టణంలోని జానపాడు రోడ్డు లోగల ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రార్థన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండి ఉస్మాన్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎండి గఫార్ మాజీ జెడ్పిటిసి వీరభద్రుని రామిరెడ్డి,మండల పరిషత్ అభివద్ధి కమిటీ చైర్మన్ మూడేళ్ల వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్సిపి పట్టణ యూత్ ప్రెసిడెంట్ మందా సుధీర్, ముస్లిం మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

మంగళగిరిలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

సత్తెనపల్లి ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు

పిడుగురాళ్లలో ఈద్గాలో ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాసు

ఐటీసీ డిస్ట్రిబ్యూటర్ రాంబాబుకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న బ్లడ్ బ్యాంకుకు తన వంతు సాయంగా నరసరావుపేటకు చెందిన ప్రముఖ ఐటిసి డిస్ట్రిబ్యూటర్ అమరా రాంబాబు తన కుమారుడు అమరా వెంకటేష్‌తో కలిసి రూ.1 లక్ష చెక్కుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంస్థకు అందజేశారు. శనివారం ఈ చెక్కును పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ లోతేటి శివశంకర్, పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి కలిసి సంస్థకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లోతేటి బ్లడ్ బ్యాంకుకు లక్ష రూపాయల చెక్కును అందజేసిన అమరా రాంబాబుని ప్రత్యేకంగా అభినందించారు. అమరా రాంబాబు స్ఫూర్తితో ఆర్థిక వెసులుబాటు ఉన్న ప్రతి ఒక్కరూ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని ఆయన కోరారు. రెడ్ క్రాస్ పల్నాడు జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల పట్ల దాతృత్వం కలిగిన అమరా రాంబాబు ఎన్నో సేవాకారక్రమాలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ గుప్తా, అమరా రాంబాబు కుమారులు అమరా వెంకటేష్ మీడియా మిత్ర కొణిజేటి రమేష్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధులు

చంద్రబాబుపై రాళ్ల దాడికి టిడిపి నిరసన

ప్రజాశక్తి- చిలకలూరిపేట : చంద్రబాబు నాయుడు కాన్వాయ్ పై వైసిపి మూకలు రాళ్ళ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం స్థానిక పండరీపురం ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో చంద్రబాబు నాయుడు బహిరంగ సభా స్థలం వద్దకు రోడ్ షోగా వస్తుండగా వైసిపి మంత్రి ఆదిమూలపు సురేష్, వారి అనుచరులు చంద్రబాబు కాన్వాయి పైనా , చంద్రబాబు నాయుడు పైనా రాళ్ల దాడికి పాల్పడ్డారని ఈ ఘటనతో చంద్రబాబుకి రక్షణగా ఉన్న ఎన్ఎస్‌జీ కమాండోస్ వెంటనే చంద్రబాబుకి రక్షణగా నిలబడటంతో వారు ప్రాణాపాయం నుండి బయటపడ్డారన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్యానికే దుష్పరిణామన్నారు. చంద్రబాబు నాయుడుకి తిరిగి ఇలాంటి పరిస్థితులే ఎదురైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

వినకొండలో నిరసన ప్రదర్శన చేస్తున్న టిడిపి నాయకులు

మాచర్ల :మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై యర్రగొండపాలెంలో రాళ్ళదాడి చేయటం ఆమానుషమైన ఘటన అని టిడిపి పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు అన్నారు. దాడిని ఖండిస్తూ స్థానిక అంబేద్కర్ పార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయడిపై మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులు రాళ్ళతో దాడి చేయటం అత్యంత హేయనీయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో పేరువాల పుల్లారావు, ఆన్వర్‌బాషా, కుర్రి శివారెడ్డి, వజ్రంనాయక్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ టిడిపి ఆధ్వర్యంలో నిరసన

వినుకొండ: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కాన్వాయ్ పై వైసీపీ కార్యకర్తలు అరాచకంగా రాళ్లతో దాడి చేసి ఎన్ఎస్‌జి కమాండో గాయపరచడాన్ని తీవ్రంగా ఖండిస్తూ వినుకొండ టిడిపి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పలనాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరయ్యారు. నిరసన ర్యాలీ అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పీవీ సురేష్ బాబు, టిడిపి నాయకులు షమీంఖాన్, గంధం కోటి, కరిముల్లా, జానీ భాష, పల్లె మీసాల దాసయ్య, పత్తి పూర్ణ పాల్గొన్నారు.

మురుగునీరు పాయేదెలా..!

- రోడ్లపైకి,నివాస ప్రాంతాల్లోకి చేరి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టని వైనం
- మోటారుల కెపాసిటీలు పెంచి డంపింగ్ చేయాలంటున్న స్థానికులు
- శుద్ధి చేసిన తరువాతే కాలువలకు పంపాలని విన్నపాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలో బైపాస్‌రోడ్డు ప్రాంతంలో పెరుగుతన్న పట్టణీకరణ దృష్ట్యా మురుగు ప్రమాదం పొంచి ఉంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగు కాల్వలు పొంగి పొర్లుతున్నాయి. ఒక్కో సారి మురుగు రోడ్ల పైకి వచ్చి తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ ప్రజల రాకపోకలకు కూడా ఇబ్బంది కలుగుతోంది. ఈ సమస్య పరిష్కారానికి మురుగు వాటర్‌ను శుద్ధి చేసే స్యూయిజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణ తప్ప మరొక మార్గం లేదని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం సిఎం నివాసం సమీపంలోని భరతమాత సెంటర్, అరవింద హైస్కూల్ తదితర ప్రాంతాల్లో అపార్టుమెంట్ల నుంచి వస్తున్న మురుగునీటిని బకింగ్ హోమ్ కాలువలోకి మళ్లించడానికి తక్కువ కెపాసిటీ గల మోటార్లను వినియోగిస్తున్నారు. దీని వల్ల మురుగునీటిని సరైన సమయంలో డంపింగ్ చేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ఆ మురుగు నీరు కనకదుర్గ ఆలయానికి చెందిన పొలంలోకి, క్రిష్టియన్ పేట పెట్రోల్ బంకు వెనుక భాగంలోని నివాస ప్రాంతాల్లోకి డ్రెయినేజీ నీరు వెళ్తుంది. దుర్గంధంతో కూడిన ఈ నీటిని తాము భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. మణిపాల్ ఆసుపత్రి అపార్టుమెంట్ల నుండి వచ్చే మురుగునీటిని కూడా క్రిష్టియన్ పేట మీదుగా మళ్లించడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అండర్‌పాస్ దగ్గర నుంచి, ఆశ్రమం రోడ్డు ప్రాంతం నుంచి వచ్చే మురుగును మణిపాల్ ఆసుపత్రి సమీపంలో కృష్ణానదికి మళ్లిస్తే డ్రెయినేజీ సమస్య కొంత వరకు పరిష్కామవుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. మున్సిపల్ అధికారులు తమ కళ్ల ముందు రోజూ ఈ సమస్యను గమనిస్తున్నా పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క బకింగ్ హోమ్ కెనాల్‌లో డ్రెయినేజీ వాటర్‌ను పంపకూడదని కోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నా అధికారుల పట్టించుకోవడంలేదు. తాడేపల్లి బైపాస్ రోడ్డు ప్రాంతంలో పెరుగుతున్న అపార్టుమెంట్ సంస్కృతికి అనుగుణంగా సుమారు పది ప్రాంతాల్లో సూయిజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేసి బకింగ్ హోమ్ కెనాల్‌లోగానీ, కృష్ణానదిలోగానీ నీటిని డంపింగ్ చేయాలని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకుని మురుగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలోకి పంపుతున్న మురుగు నీరు

శుద్ధి చేసిన తరువాతే కాలువలోకి వదలాలి..

పౌర సంక్షేమ సంఘం తాడేపల్లి కార్యదర్శి డివి భాస్కర్ రెడ్డి

తాడేపల్లిలో వివిధ అపార్టుమెంట్ల నుంచి వస్తున్న మురుగునీటిని మొత్తం సూయిజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టిపి) ఏర్పాటు చేసి మురుగునీరు మొత్తం శుద్ధి చేసిన తరువాతే కెనాల్‌లోకి, కృష్ణానదిలోకి డంపింగ్ చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం తాడేపల్లి కార్యదర్శి డివి భాస్కరరెడ్డి ఓ ప్రకటనలో అధికారులను కోరారు. అలాగే మురుగును డంపింగ్ చేస్తున్న మోటార్ల కెపాసిటీని పెంచాలని కోరారు. వేసవి కాలంలోనే యుద్ధప్రాతిపదికన తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

రోడ్డుపైకి, ఇళ్లలోకి చేరిన మురగు నీరు (ఫైల్‌ఫోటో)

డంపింగ్ చేసేందుకు వాడుతున్న ఇంజన్

మొక్కజొన్నకు గిట్టుబాటేది..!

రోజుకో ధరతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - దుగ్గిరాల

రబి ప్రారంభం నుండే రైతుకు కష్టాలు ప్రారంభమయ్యాయి రెండవ పంటగా మొక్కజొన్నను విత్తిన అనంతరం కురిసిన వర్షాలకు గింజలు కుళ్లిపోయాయి. దీంతో అధిక శాతం రైతులు రెండోసారి విత్తు కోవాల్సి వచ్చింది. ఈ ప్రాంతంలో అప్పటి నుండి సరైన వర్షాలు లేవు.ఈ పంట సాగుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. సకాలంలో వర్షాలు లేకపోవడంతో దిగుబడి కూడా తగ్గి పోయింది. ఇంత కష్టపడ్డ రైతులకు కొద్దో గొప్పో పంట దక్కితే, వాటి ధరలు మాత్రం నిరాశజనకంగా ఉన్నాయి. గత ఏడాది రబీ ప్రారంభంలో క్వింటా రూ.1950గా ఉన్న మొక్కజొన్న ధరలు రూ.2,500 వరకు పెరిగాయి. అదే, ఈ ఏడాది రబీ ప్రారంభంలో క్వింటా మొక్క జొన్న ధర రూ.2,200 పలికింది. ప్రస్తుత ధర రూ.1700కు పడిపోయింది.ఇంకా ధరలు తగ్గే అవకాశాలు ఉన్నాయని, ఈ ఏడాది మాత్రం ఆ పరిస్థితి ఉండకపో వచ్చని వ్యాపారస్తులు చెబు తున్నారు.

మన రాష్ట్రంలో రబీ అనంతరం ఆల స్యంగా బీహార్ రాష్ట్రంలో (రబి) ఈ సీజన్ ప్రారంభమవుతుంది. అక్కడ పంట దిగుబడిని అనుసరించి ధరలు ఉంటా యని వ్యాపారస్తులు అంటున్నారు. బీహార్‌లో రెండు పంటలూ కూడా మొక్క జొన్న పండిస్తారని, దేశంలో దిగుబడి అయ్యే మొక్కజొన్నలో 80 శాతం ఈ రాష్ట్రంలోనే పండిస్తారని చెప్పారు. బీహార్ లో దిగుబడి తగ్గితే ధరలు పెరుగు తాయని, దిగుబడి బాగా ఉంటే ధరలు తగ్గుతాయని ప్రచారం జోరుగా సాగు తోంది. ఈ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే రబీ ప్రారంభమవుతుంది. మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో జోరు అందుకుంటుంది అప్పటికి ధరలు ఎలా ఉంటాయనేది వేచి చూడాలి. పౌల్ట్రీ ఫారాల నుండి కొనుగోళ్లకు డిమాండ్ లేదని వ్యాపారస్తులు అంటు న్నారు.

కోత కోసిన మొక్కజొన్న

ప్రస్తుత మద్దతు ధర కన్న తక్కువకు మొక్కజొన్న ధరలు దిగజారడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త ధర ప్రకటించినా రైతులకు, ముఖ్యంగా కౌలు రైతులకు ఉపయోగం ఉండకపోవచ్చు. ఇ-కెవైసి చేయించిన రైతుల పంట మాత్రమే ప్రభుత్వం కొను గోలు చేస్తోంది. పండించిన పంట మొత్తం కొనుగోలు చేయాలని రైతులు కోరుకుంటున్నారు. కానీ, గతంలో ఈ విధంగా ఎన్నడూ కొను గోలు చేయలేదు. డెల్టా ప్రాంతంలో దాదాపు 70 శాతం మంది కౌలు రైతులు ఉన్నారు. ప్రైవేట్ వ్యాపారస్తుల దయా దాక్షిణ్యాలపై వీరు ఆధారపడాల్సి వస్తోంది.

వ్యాపారస్తుల సిండికేట్?

వ్యాపారస్తులు సిండికేట్ అయినట్లు రైతులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు డెల్టా ప్రాంతంలోని కొనుగోలుదారులు ఇటీ వల తెనాలిలో సమావేశమయ్యారని వారు ఆరోపిస్తున్నారు. పోటీపడి ధరలు పెంచ కుండా తక్కువ ధరలకు కొనుగోలు చేయాలని వారు నిర్ణయించుకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

బాధ్యత ప్రభుత్వానిదే

రైతుకు నష్టం కలుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కొనుగోలు కేం ద్రాల ద్వారా నిబంధనలు సడలించి మద్దతు ధరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్లయితే, రైతులకు, కౌలు రైతులందరికీ లాభం చేకూరు తుందని వారు చెబుతున్నారు.

రెండో పంట ప్రధానం

డెల్టా ప్రాంతంలో రైతులకు ముఖ్యం గా కౌలు రైతులకు రెండో పంట ప్రధాన మైంది. కష్టానికి ఫలితం తగ్గాలంటే రెండో పంటే ఆధారం . గతంలో ఈ ప్రాంతంలో మినుము సాగు చేసేవారు. మినుము తెగుళ్ల బారిన పడటం, పౌల్ట్రీ పరిశ్రమ అభి వృద్ధి చెందిన తర్వాత మొక్కజొన్నకు డిమాండ్ పెరిగింది. దీంతో, రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపారు. మండల వ్యాప్తంగా దాదాపు 19 ఎకరాల్లో మొక్కజొన్న సాగు అవుతోంది.



పంట మొత్తం కొనుగోలు చేయండి

ప్రైవేట్ వ్యాపారస్తులపై రైతులు ఆధార పడకుండా ఉండాలంటే ప్రభుత్వమే పంట మొత్తం కొనుగోలు చేయాలని కౌలు రైతు రియాజ్ ఖాన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన తర్వాత వెంటనే డబ్బు చెల్లించాలని కోరారు. వెంటనే డబ్బు చెల్లించకపోతే రైతులు, ప్రైవేట్ వ్యాపా రస్తులను ఆశ్రయించక తప్పడంలేదని చెప్పారు. కౌలు రైతులు పండించిన పంటను అమ్ము కునేందుకు ప్రభుత్వ నిబం ధనలు అడ్డంగా మారాయని, వీటిని సడలించాలని అభిప్రాయపడ్డారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రేపు జరిగే జై భారత్ సత్యాగ్రహ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -మంగళగిరి

ఈ నెల 24వ తేదీన విజయవాడలోని జింఖానా గ్రౌండ్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే జై భారత్ సత్యాగ్రహ సభను జయప్రదం చేయాలని మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం అన్నారు. శనివారం సాయంత్రం మంగళగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన పోస్టరును ఆవిష్కరించారు. సభకు మంగళగిరి ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని సలీం కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టి. వెంకటేశ్వరరావు, ఆర్. హనుమంతరావు, జి . సాంబశివరావు, జి. వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

వాటర్ బాటిల్స్‌ను అందజేస్తున్న టిడిపి నాయకులు

తాగునీటి బాటిల్స్ పంపిణి

ప్రజాశక్తి- మంగళగిరి

రంజాన్ పండుగ సందర్భంగా మంగళగిరి పట్టణంలో మసీదులకు వచ్చిన ముస్లిం సోదరులకు నారా లోకేశ్ సహకారంతో టిడిపి ఆధ్వర్యంలో శనివారం పట్నంలోని మసీదుల వద్ద తాగునీటి బాటిల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, ఎండి ఇబ్రహీం, వింజమూరు చంద్రశేఖర రావు, చింత వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

చంద్రబాబుపై రాళ్లదాడి హేయం

ప్రజాశక్తి-మంగళగిరి

మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు పై ఎర్రగొండపాలెం పర్యటనలో వైసిపి కార్యకర్తలు రాళ్ల దాడి హేయమైన చర్య అని , దీనిని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలని శనివారం టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు కోరారు. మంగళగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో దళితులు అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలన పై దళితుల్లో వ్యతిరేకత పెరగడంతో రాష్ట్ర పురపాల శాఖ మంత్రి ఆది మూలపు సురేష్ ఆధ్వర్యంలో దాడులు జరుగుతున్నట్లుగా తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి ఎస్సీ సెల్ నాయకులు పి ప్రేమ్ కుమార్, వి మైనర్ బాబు, వై.భాగ్య రావు తదితరులు పాల్గొన్నారు.

నాబార్డ్ ఏజిఎం కార్తీక్ బదిలీ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.ఆర్.డి.కార్తీక్ లక్నో బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జిల్లా నాబార్డ్ ఏజిఎంగా భువనేశ్వర్ నుండి బదిలీపై వచ్చిన జి.శరత్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. కార్తీక్ 2017లో జిల్లా ఏజిఎంగా బాధ్యతలు స్వీకరించి, ఆరు సంవత్సరాల పాటు జిల్లాలో సేవలు అందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న అంజయ్య, తదితరులు

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

దేశ వ్యాప్తంగా 3 నుండి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య గుంటూరు జోన్ విద్యార్థులు ప్రతిభ చూపారని శ్రీచైతన్య ఏజిఎం నూతలపాటి అంజయ్య తెలిపారు. అత్యధికంగా ముగ్గురు విద్యార్థులు ల్యాప్‌టాప్ గ్రాండ్ ప్రైజులుగా సాధించటంతోపాటు 26 మంది విద్యార్థులు ట్యాబ్స్ సాధించారన్నారు. అదే విధంగా 110 మంది విద్యార్థులు టాప్ 5 ర్యాంకులను, 4176 మంది విద్యార్థులు మెడల్స్ సాధించారని చెప్పారు. కార్యక్రమంలో ఏజిఎం అంజయ్య, తెనాలి జోన్, ఆర్ఐ అప్పాజీ, పల్నాడు ఆర్ఐ సురేంద్ర, అకడమిక్ కోఆర్డినేటర్స్ పివిడి గోపీచంద్, కె.శ్రీనివాసరావు, బి.గోవర్ధన్‌తోపాటు, ప్రిన్సిపాల్స్, డీన్స్ విద్యార్థులను అభినందించారు.

దుగ్గిరాల జెడ్‌పిటిసి భర్తపై ఫిర్యాదు

ప్రజాశక్తి - మంగళగిరి

దుగ్గిరాల జెడ్‌పిటిసి భర్త దాసరి వీరయ్యపై టిడిపి నాయకులు మంగళగిరి పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 18వ తేదీ రాత్రి సమయంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్యకు ఫోన్ చేసి మీరు, పోతినేని శ్రీనివాసరరావులు ఎప్పుడైనా దుగ్గిరాల వస్తే మార్గ మధ్యలో ఉన్నటువంటి మద్రాసు కాలవలోకి తోసివేసి తొక్కి చంపుతా అని బెదిరించి అసభ్యంగా దూషించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరయ్యపై గతంలో పలు కేసులు ఉన్నాయని టిడిపి నాయకులు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు, మంగళగిరి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు తోట పార్థసారధి, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్-2 టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి

మండల కేంద్రంలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా వట్టికుంట శేషగిరిరావు ఆధ్వర్యంలో అమరావతి ప్రీమియర్ లీగ్ -2 టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ని వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. అనంతరం టీం సభ్యులకు అభినందనలు తెలిజేశారు. ఈ శ్రీనివాస్ మాట్లాడుతూ పథమ ద్వితీయ బహుమతులకు గాను శేష గిరిరావు రూ. 70,000 ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. కార్యక్రమంలో భాను, బంతి, సందీప్ తథిదరులు పాల్గొన్నారు.

రాజధానిలో ముదురుతున్న మరో వివాదం

రాజధాని గ్రామాల్లో గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన పేదలకు ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈమేరకు గత నెల 21న ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. దీనిపై రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై విచారించిన హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఇళ్ల స్థలాల కేటాయింపును వ్యతిరేకిస్తూ రైతులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచించింది. హైకోర్టు నిర్ణయం కోసం వేచిచూడకుండా ప్రభుత్వం ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధిత గ్రామాల్లో భూములను అభివృద్ధి చేస్తోంది. మొత్తం 20 లే అవుట్లలో స్థలాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందు కోసం టెండరు పద్ధతికాకుండా పనులను నామినేషన్ పద్ధతిపై కేటాయించారు. రాజధానిలోని కృష్ణాయపాలెం, వెంకటపాలెం,నిడమర్రు, కురగల్లు,మందడం, ఐనవోలు గ్రామాల పరిధిలో గుంటూరు, కష్ణా జిల్లాలకు చెందిన 48,218 మందికి ఉచితంగా ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు అధికారులు ఇప్పటికే లబ్ధిదారులను గుర్తించారు. ఈనెలాఖరులోగా వీరికి పట్టాలు ఇచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సిఆర్‌డిఏ పరిధిలో మొత్తం 900.97 ఎకరాల భూమి పేదల ఇళ్లకోసం కేటాయించారు. ఐనవోలు, మందడం, కష్ణాయపాలెం, నవులూరు, కురగల్లు, నిడమర్రు ప్రాంతాల్లో పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టంలో మార్పులు చేసింది.ఐదు గ్రామాల పరిధిలో సంబంధిత భూములను గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు పనులు ప్రారంభించాలని ప్రభుత్వం సిఆర్‌డిఏ అధికారులకు సూచించింది. ఇందుకు వ్యతిరేకంగా సోమవారంనుంచి ప్రజాచైతన్యయాత్ర నిర్వహించాలని అమరావతి జెఎసి నిర్ణయించింది. ఇందుకోసం ఈ ఐదు గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రజా చైతన్యయాత్ర నిర్వహించాలని జెఎసి నాయకులు నిర్ణయించారు. కృష్ణాయపాలెం నుంచి నిడమర్రు వరకు పాదయాత్ర చేయనున్నారు.ఒకవైపు అమరావతిని అభివృద్ధి చేయకుండా నాలుగేళ్లుగా పట్టించుకోని ప్రభుత్వం ఇతర ప్రాంత వాసులకు పట్టాలు ఇవ్వడం ఏమిటని రైతులు ఆయా గ్రామాల్లో లే అవుట్‌ల నిర్మాణానికి వచ్చిన అధికారులను

వీక్షణం

అడ్డుకుంటున్నారు. భూముల చదునుకోసం తెచ్చిన యంత్రాలను రైతులు గత మూడు రోజులుగాఅడ్డుకుంటున్నారు. రాజధాని ప్రాంతంలో భూములను స్థానికేతరులకు ఇళ్ల స్థలాలు కేటాయింపుపై రాజధాని రైతుల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కురగల్లులో పనులను అడ్డుకున్న రైతులను పోలీసులు ఆదుపులోకి తీసుకున్నారు. రాజధానికి భూ సమీకరణలో భూములిస్తే తమకు అప్పగించిన ప్లాట్‌లను మాత్రం అభివృద్ధి చేయకుండా రాజధానియేతర ప్రాంతాల పేదలకు అభివృద్ధి చేసిన ప్లాట్‌లను కేటాయించడం ఏమిటని వారు నిలదీస్తున్నారు. పేదలపై ప్రేమ ఉంటే రాజధాని గ్రామాల్లో ఇప్పటికేనిర్మించిన 5034 టిడ్కో ఇళ్లను వైసిపిప్రభుత్వం ఇంత వరకు పేదలకు ఎందుకు అప్పగించలేదని రైతులు నిలదీస్తున్నారు. నాలుగేళ్లుగా ఇళ్ల కోసం 5034 మంది ఎదురు చూస్తున్నారని వారు వాపోతున్నారు.

(ఎ.వి.డి.శర్మ)

గొప్ప దార్శనికుడు లెనిన్‌కు నివాళి

గుంటూరు సిపిఎం కార్యాలయంలో లెనిన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సుంకర రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని తొలిసారిగా సోవియట్ యూనియన్‌లో అమలు జరిపిన గొప్ప దార్శనికుడు వి.ఐ.లెనిన్ అని, దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సిద్ధాంతాన్ని సోవియట్‌లో అమలు జరిపిన ఘనత ఆయనకే దక్కుతుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం బ్రాడీపేట సిపిఎం కార్యాలయంలో లెనిన్ 153వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మార్క్సిజం పిడిసూత్రం కాదని, ఆచరణకు మార్గదర్శి అని మానవజాతి విముక్తికి మార్క్సిజం, లెనినిజమే పరిష్కారమన్నారు. మానవ శ్రమ ద్వారానే సంపద సృష్టించబడుతుందని, ఆ సంపద కష్ట జీవులకే చెందాలని మార్క్సిజం చెప్తుందన్నారు. నేటి సమాజానికి మార్క్సిజం పనికిరాదని పెట్టుబడిదారులు ప్రచారం చేస్తున్నారని, ఆ పెట్టుబడిదారీ విధానమే సంక్షోభంలోకి కూరకుపోతే దాని పరిష్కారానికి క్యాపిటల్ గ్రంధాన్ని పెట్టుబడిదారులు అధ్యయనం చేస్తున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక, నిత్యజీవితావసర సరుకుల ధరలు పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు అకాశాన్నంటుతున్నాయని ప్రైవేటీకరణ పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పోరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చాక భారత రాజ్యాంగానికి ప్రమాదం ముంచుకొస్తుందని, రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. ప్రజల మధ్య కుల, మత, ప్రాంతీయ తత్వాలను రెచ్చగొడుతుందన్నారు. వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఐలు రాష్ట్ర నాయకులు మూర్తి, మోహన్‌రావు, శైలజ, మాధవరావు, శేషగిరి, సిపిఎం నాయకులు వై.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -మంగళగిరి

ప్రపంచ విప్లవ యోధుడు లెనిన్ జయంతి సందర్భంగా మంగళగిరి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్ని తిరపతయ్య, కంచర్ల కాసియా, జాలాది జాన్ బాబు, ఆర్దల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి : పిన్నెల్లి

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ప్రభుత్వ విప్,ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి వివరించారు. శనివారం ఉదయం పట్టణంలోని నెహ్రూనగర్‌లోని 2వ లైనులో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్, 4వ వార్డులో మంచినీటి కోసం నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ పైపులైను, రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ని ప్రభుత్వ విప్,ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి, తన తమ్ముడు వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజల సమస్యలు పరిష్కరించటంలో అధికారులు ప్రత్యేక చొరవతో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆనారోగ్యంతో బాధ పడుతున్న ఆవుల వెంకటనారాయణను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమీషనర్ ఇవి రమణబాబు, కౌన్సిలర్లు,నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు,గట్ల కోటిరెడ్డి, రామాంజిరెడ్డి, గంధం భాస్కరరావు, ఆదినారాయణ, ఆర్.టి.సి శ్రీనివాసరెడ్డి, మంజుల మల్లికార్జునరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్యకు పరిష్కారం

నేటి నుండి యథావిధిగా నీటి సరఫరా

ప్రజాశక్తి - మాచర్ల



విద్యుత్ డిఇతో మాట్లాడుతున్న కమిషనర్ ఇవి రమణబాబు

విద్యుత్ డిఇ జె హరిబాబుతో జరిపిన చర్చల నేపథ్యంలో పంపుహౌస్ వద్ద లోవోల్టేజ్ సమస్య పరిష్కారం అయినట్లు మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు శనివారం తెలిపారు. పంపుహౌస్ వద్ద లోవోల్టేజ్ సమస్య రావటంతో గత వారం రోజుల నుండి మున్సిపల్ రిజర్వాయర్ నుండి వాటర్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ డిఇ జె హరిబాబుతో చర్చలు జరిపి ఇరు శాఖల టెక్నికల్ సిబ్బందిని సమన్వయ పర్చటంతో లోవోల్టేజ్ సమస్య పరిష్కారం అయినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం నుండి ప్రజలకు కుళాయిల ద్వారా కుడికాలువ నీటిని సరఫరా చేస్తున్నట్లు పట్టణ ప్రజలకు వివరించారు.